సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 379 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.6

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.2.50, సరాసరి రూ.4 పలికింది.

గరిష్టం/కనిష్టం
41.6°/23.2°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మేడాపురం పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు

రాప్తాడు రూరల్: రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం పంచాయతీ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 24న పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకోనున్నారు. పంచాయతీల్లో 'స్థిరమైన అభివృద్ధి' సాధించేందుకు పంచాయతీరాజ్ శాఖ మొత్తం 9 లక్ష్యాలను పెట్టుకోగా, 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' అంశంలో మేడాపురం పంచాయతీ ఎంపికైంది.

మొక్కజొన్నకు 'మద్దతు'

- క్వింటా రూ.1,962తో కొనుగోళ్లు



పుట్టపర్తి అర్బన్: మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్వింటా రూ.1,962 ప్రకారం కనీస మద్దతు ధరతో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. మొక్కజొన్న పండించిన రైతులు పంట విక్రయానికి ఈ నెల 24 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల పంట మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు.

ఉద్యానానికి 'ఉపాధి' ప్రోత్సాహం

పుట్టపర్తి: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, పూల తోటల పెంపకానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. మొత్తంగా 17 రకాల పూలు, పండ్ల తోట్ల పెంపకానికి సంబంధించిన నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుందని డ్వామా పీడీ రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 4,000 ఎకరాల్లో కొత్తగా ఉద్యాన తోటలు సాగయ్యేలా కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మామిడి, చీనీ, సపోటా, జామ, నిమ్మ, చింత, అల్ల నేరేడు, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అంజూరా లాంటి పండ్ల తోటలతో పాటు మల్లె, గులాబీ లాంటి పూల తోటల పెంపకానికి మూడేళ్ల పాటు 'ఉపాధి' హామీ ద్వారా నిర్వహణ ఖర్చులు ఇస్తామన్నారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, జాబ్ కార్డుతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

12 మండలాల్లో మోస్తరు వర్షాలు



పుట్టపర్తి సత్యమ్మ ఆలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. నిన్నటి వరకూ భానుడు ఉగ్రరూపం చూపగా, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని 12 మండలాల పరిధిలో వర్షపాతం నమోదైంది. నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి, గోరంట్ల మండలాల్లో 23 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో 35.6 మిల్లీ మీటర్లు, రొళ్ల, సోమందేపల్లి మండలాల్లో 4.2 మి.మీ మేర వర్షం కురిసింది. కాగా రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

ఆర్టీసీ.. లాభాలు మేటి

- జిల్లా కేంద్రం పుట్టపర్తికి పెరిగిన రాకపోకలు
- రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచిన ఆర్టీసీ
- పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు తిప్పుతున్న వైనం
- జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకూ బస్సులు.. కార్గో సేవలు
- గతంతో పోలిస్తే బాగా పెరిగిన లాభాలు



పుట్టపర్తి -కదిరి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

1.09 లక్షలు జిల్లా ఆవిర్భావానికి ముందు బస్సుల్లో ప్రయాణించేవారు

1.40 లక్షలు ప్రస్తుతం రోజూ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు

160 ఆర్టీసీ రూట్లు

రూ.55 లక్షలు జిల్లాలో రోజూ సరాసరి ఆర్టీసీ ఆదాయం

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ జిల్లాలో లాభాల్లో దూసుకుపోతోంది. గతంతో పోలిస్తే మెరుగైన ప్రగతి సాధించింది. రూట్లు పెంచడం, ప్రత్యేక సర్వీసులు, కార్గో సేవలు విస్తరణ ఇలా ప్రతి అంశంలోనూ విశేష ప్రగతి సాధించింది. జిల్లా ఏర్పడక ముందు రోజుకు సగటున 1.09 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. ప్రస్తుతం సగటున 1.40 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి డిపోలనుంచి వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచింది. దీంతో సగటున రోజుకు రూ. రూ.55 లక్షల నుంచి రూ.60 లక్షల దాకా ఆదాయం ఆర్జిస్తోంది.

రద్దీకి అనుగుణంగా బస్సులు..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతోంది. ఇప్పటికే ప్రధాన ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం పుట్టపర్తితో పాటు ఇతర ప్రాంతాలకు కొత్త సర్వీసులు ఏర్పాటు చేసింది. జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, హిందూపురం మడకశిర డిపోలుండగా, 678 మంది డ్రైవర్లు, 586 మంది కండెక్టర్లు ఉన్నారు. మొత్తం 160 రూట్లలో బస్సులు తిప్పుతున్నారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి జిల్లా కేంద్రం పుట్టపర్తికి సర్వీసులు తిప్పుతున్నారు. ఈ క్రమంలోనే సర్వీసులతో పాటు రూట్ల సంఖ్య కూడా పెంచారు. అంతే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు కూడా సర్వీసులు నడుపుతున్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు..

జిల్లా కేంద్రం పుట్టపర్తి నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, తిరునాళ్లకు ఒకే రోజు వెళ్లి తిరిగి వచ్చే విధంగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసి సర్వీసులు నడుపుతోంది. వాటి ద్వారా ఆదాయం పెరుగుతోంది. సంక్రాంతి, దసరా పండగల వేళ సర్వీసులు పెంచుతోంది. అలాగే ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.

కార్గో సేవలు విస్తృతం..

జిల్లా ఆవిర్భావం తర్వాత ఆర్టీసీ కార్గో సేవలు మరింత పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా 30 కార్గో బుకింగ్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా రోజూ సరాసరిన 900 బుకింగ్‌లు వస్తుంటాయి ఇందుకుగాను రోజుకు రూ.70 వేల ఆదాయం వస్తోంది. డోర్ డెలివరీ బుకింగ్‌ల ద్వారా 50 బుకింగులు రాగా, రూ. 3 వేల వరకు ఆదాయం వస్తోంది. బల్క్ బుకింగ్ ఉంటే వినియోగదారుల వద్దకే ఆర్టీసీ సిబ్బంది వెళ్తున్నారు. నిర్ణీత సమయంలోనే పార్సిళ్లు డెలివరీ చేస్తున్నారు. కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా మరిన్ని బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

రైలు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సర్వీసులు..

జిల్లా ఏర్పడిన తర్వాత ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పుతోంది. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ మీదుగా 12 రైళ్లు నడుస్తున్నాయి. కొన్ని డైలీ, కొన్ని బైవీక్లీ, మరిన్ని వీక్లీ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు ప్యాసింజర్ రైళ్లు కూడా నడుస్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ సర్వీసులు కూడా పెంచారు. దీంతో జనమంతా ఆర్టీసీ బాట పట్టగా, ఆదాయం పెరిగింది.

మరిన్ని సర్వీసులు



జిల్లా కేంద్రం పుట్టపర్తికి వచ్చే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగానే బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికుల రాకపోకలను గుర్తించి సర్వీసులు కూడా పెంచుతాం. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ఆదాయం కూడా పెరిగింది. కార్గో సేవలూ విస్తరించాం. పండుగలు, తిరునాళ్ల సమయంలో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుతున్నాం. దీనివల్ల గతంలో కంటే ఆదాయం పెరిగింది. - మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

ప్రయాణం త్వరగా సాగుతోంది



జిల్లా ఆవిర్భావం తర్వాత పుట్టపర్తి - కదిరి మధ్య తిరిగే బస్సుల సంఖ్య పెరిగింది. ప్రయాణమూ వేగంగా సాగుతోంది. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు కూడా బస్సులు తిప్పుతున్నారు. దీంతో జనమంతా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నారు.
– రంగారెడ్డి, గోపేపల్లి, నల్లమాడ మండలం

ప్రజా మన్ననలతోనే నిజమైన సంతృప్తి

- రాహుల్‌దేవ్ సింగ్ వీడ్కోలు సభలో ఎస్పీ మాధవరెడ్డి



రాహుల్‌దేవ్ సింగ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీలు

కొత్తచెరువు: ప్రజా మన్ననలు పొందినప్పుడే ఉద్యోగ జీవితంలో నిజమైన సంతృప్తి ఉంటుందని, ఉత్తమ సేవలతో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ అందరి ప్రేమను చూరగొన్నారని ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాహుల్‌దేవ్ సింగ్ వీడ్కోలు సభ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, రాహుల్‌దేవ్ సింగ్ నూతన జిల్లా శ్రీసత్యసాయిలో శాంతిభద్రతల పరిరక్షిస్తూ, ప్రజలతో మమేకమై పనిచేశారన్నారు. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లా తొలి ఎస్పీగా పనిచేయడం తన అదృష్టమన్నారు. ఇక్కడి సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, పలువురు డీఎస్పీలు మాట్లాడుతూ, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ వద్ద పనిచేయడం తమ అదృష్టమన్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌ను పోలీస్ సిబ్బంది మెమెంటో అందించి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, యశ్వంత్, భవ్యశ్రీ, విజయ్‌కుమార్, సీఐలు రవీంద్రారెడ్డి, జయ నాయక్, వెంకటేశ్వర్లు, పలువురు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ విత్తన ప్రణాళిక సిద్ధం

- 1,01,141 క్వింటాళ్ల విత్తనం రాయితీతో పంపిణీ చేసేలా ప్రణాళిక



విత్తన వేరుశనగ కాయలు

పుట్టపర్తి అర్బన్: సాగులో రైతుకు సాయంగా నిలుస్తున్న వైఎస్ జగన్ సర్కార్ సీజన్‌కు ముందే విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెస్తోంది. ఈక్రమంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతులకు 1,01,141 క్వింటాళ్ల రాయితీ విత్తన పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో విస్తారంగా సాగయ్యే వేరుశనగ, కంది పంటలకు అవసరమైన విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. 2023-24 సీజన్‌లో వేరుశనగ, కందితో పాటు చిరుధాన్యాలు, జీలుగ అందజేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇక ఈఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో చిరుధాన్యపు పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నాణ్యమైన విత్తనాల పంపిణీ..

నాణ్యమైన విత్తనాలు సేకరించి రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగా జిల్లాకు 1,01,141 క్వింటాళ్లతో ఖరీఫ్ విత్తన ప్రణాళిక తయారు చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. వీటిలో వేరుశనగ 1,00,907 క్వింటాళ్లు, రాగి 50 క్వింటాళ్లు, కందులు 100 క్వింటాళ్లు, పెసలు 50 క్వింటాళ్లు, జీలుగ 34 క్వింటాళ్లు అందజేయనున్నారు. వీటిని ఏపీ సీడ్స్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు చేర్చి రైతులకు గ్రామాల్లోనే పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

త్వరలోనే ఉపాధ్యాయ బదిలీలు

- ఒక డీఏ పెంచేందుకు సీఎం జగన్ అంగీకారం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కొత్తచెరువు/ప్రశాంతి నిలయం: ఉపాధ్యాయ బదిలీలు త్వరలోనే ఉంటాయని, ఒక డీఏ కూడా విడుదల చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించారని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి మూల్యాంకన ప్రక్రియను పరిశీలించారు. సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెంచడం పట్ల సీఎం, ఎమ్మెల్సీలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లామని, పరిష్కారానికి ఆయన సానుకూలంగా ఉన్నారన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు/ రెన్యూవల్స్ గడువును మూడు నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం 38 జీఓ విడుదల చేసిందన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీఈఓ కార్యాయం సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, డీసీఈబీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, కాడిశెట్టి శ్రీనివాసులు, గోవింద రెడ్డి, పీవీ రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అపూస్మా జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి, ప్రభాకర్, గోపాల్‌నాయక్, గోపాల్ నాయక్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లాహు అక్బర్

- భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



చిన్నారుల ఈద్ ముబారక్



కదిరి: రంజాన్ సందర్భంగా ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



రంజాన్ ప్రార్థనల్లో చిన్నారి



హిందూపురం: అల్‌హిలాల్ ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సామూహిక ప్రార్థనల నడుమ రంజాన్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం నుంచే హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర పట్టణాల్లోని ఈద్గాల్లో ప్రార్థనలకు ముస్లింలు పోటెత్తారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్..' చెప్పుకున్నారు. పెద్దలు, గురువులపట్ల వినయ విధేయతలతో ఉండాలని, మత సామరస్యం, సోదరభావం, సౌభ్రాతృత్వాన్ని ప్రతి ముస్లిం చాటాలని మతపెద్దలు తమ సందేశాల ద్వారా పేర్కొన్నారు. వేర్వేరు చోట్ల జరిగిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యేలు శంకరనారాయణ, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

లేపాక్షిలో భువనేశ్వర్ పీఠాధిపతి



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న స్వామిజీ

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయాన్ని భువనేశ్వర్ పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ శనివారం ఉదయం సందర్శించారు. ఆలయమర్యాదలతో ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలోని శిల్పాలను, చిత్రాలను పరిశీలించి, వాటి విశేషాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బద్రీనాథ్, సెంట్రల్ సీడ్స్ బోర్డు సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని 4వ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణుల్లో రక్తహీనత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం 22 మంది గర్భిణులకు రక్త హీనత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓలు సరస్వతమ్మ, హృదయాంజలి, తదితరులు పాల్గొన్నారు.

అక్షయం.. స్వర్ణ శోభితం

- 'పురం'లో ఘనంగా అక్షయ తృతీయ
- సంపద కలిసి వస్తుందని పసిడి కొనుగోళ్లు
- బంగారు విక్రయాల సందడి



నగల కొనుగోలుతో బిజీగా ఉన్న మహిళలు

హిందూపురం: ఉత్తరాదీలు ఎక్కువగా నివసిస్తున్న హిందూపురంలో అక్షయ తృతీయను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ తిథిలో కుబేరుడు ధనాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన రోజుగాను, శ్రీకృష్ణుడు పాండవులకు అక్షయపాత్రను ప్రసాదించిన రోజుగా భావిస్తుండడంతో అక్షయ తృతీయకు ప్రత్యేకత చేకూరింది. అక్షయ అంటే ఎన్నాడూ తరిగిపోనిందని అర్థం. ఆ రోజున లక్ష్మీదేవిని పూజిస్తే అంతులేని సంపద ఇంట్లో స్థిరంగా ఉంటుందని ప్రజల విశ్వాసం. దీంతో హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర పట్టణాల్లో పెద్ద ఎత్తున బంగారు, వెండి విక్రయాలు సాగాయి.

కిటకిటలాడిన నగల దుకాణాలు..

హిందూపురంలోని గాంధీసర్కిల్, మెయిన్‌బజారు, కంసాలపేట, చిన్నమార్కెట్ ప్రాంతాల్లో శనివారం పండుగ వాతావరణం నెలకుంది. బంగారు దుకాణాలను ప్రత్యేకంగా అలంకరించి, నగలు, వెండి సామగ్రి కొనుగోలుదారులకు డిస్కౌంట్ల ఆఫర్ ప్రకటించారు. దీంతో బంగారు, వెండి సామగ్రి కొనుగోలుదారులతో ఆయా మార్కెట్‌లో కిటకిటలాడాయి. అక్షయ తృతీయ దినాన ఆవగింజంతైనా బంగారాన్ని కొనాలనే సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

హిందూపురంలో వెండి, బంగారు విక్రయాలు ఇలా..	
24 క్యారెట్ల ఒక గ్రాము బంగారం	రూ.6,100
919 హాల్‌మార్క్ గ్రాము బంగారం	రూ.5,600
కేడీఎం గ్రాము బంగారం	రూ.4,850
వెండి ఆభరణాలు గ్రాము	రూ.74

కమ్మలు, వెండి పట్టీలు కొన్నా



అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే మంచిందని అంటారు. దీంతో కమ్మలు, వెండి పట్టీలు కొన్నాను. శాస్త్రం ఏమి చెబుతోందో తెలియదు కానీ, బంగారు కొనడం వల్ల నష్టమేమీ ఉండదని భావించాను.

– నాగవేణి, ముదిరెడ్డిపల్లి

కలిసివస్తుందంటే..



మాది భద్రవతి. వేసవి సెలవులకు ఇక్కడకొచ్చాను. అక్షయ తృతీయ రోజున బంగారు, వెండి కొంటే కలిసి వస్తుందని చెప్పారు. దీంతో బంగారం కొనేందుకు వచ్చాను. మా ఇంట్లో వారు సైతం ఈ సెంటిమెంట్‌ను కాదనలేకపోవడంతో నాకిష్టమైన నగ కొన్నాను.

– కవిత, భద్రావతి

పాముకాటుతో బాలిక మృతి



సోనాక్షి మృతదేహం

పరిగి: పాము కాటుతో ఓ బాలిక మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. మహారాష్ట్రలోని రాయఘడ్ జిల్లా నిజాంపుర గ్రామానికి చెందిన మంగేష్ శంకర్ జాదు, బేబి దంపతులు తమ కుమార్తె సోనాక్షి (5), తల్లిదండ్రులతో కలసి నాలుగు నెలల క్రితం పరిగి మండలానికి వలస వచ్చారు. ఎర్రగుంట సమీపంలో బొగ్గులు కాల్చే పనిలో నిమగ్నమై జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో టెంట్ ఏర్పాటు చేసుకున్నారు. శనివారం వేకువజామున పనులు ముగించుకుని జాదూ దంపతులు టెంట్‌లోకి ప్రవేశిస్తుండగా కుమార్తె కప్పుకున్న దుప్పట్లో నుంచి కట్లపాము బయటకు వస్తుండడం గమనించారు. వెంటనే దానిని చంపి, కుమార్తెను పరిశీలించగా పాము కాటుకు గురైనట్లు గుర్తించి హుటాహుటిన హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం బాలిక పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో చిన్నారిని కుటుంబసభ్యులు అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.

పరస్పర దాడి.. ఐదుగురికి గాయాలు



గాయపడిన మనోహర్ అత్త లక్ష్మీనరసమ్మ



గాయపడిన మామ నరసింహులు

ఓడీ చెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో పరస్పరం చోటు చేసుకున్న దాడుల్లో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం బోయపల్లికి చెందిన మనోహర్‌కు దిగువ గంగిరెడ్డికి చెందిన లక్ష్మీనరసమ్మ, నరసింహులు దంపతులు చిన్న కుమార్తె ఉషతో పదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాది క్రితం ఉష తన పుట్టింటికి చేరుకుంది. అప్పటి నుంచి కాపురానికి రావాలని భర్త ప్రాధేయపడుతూ వచ్చాడు. ఈ విషయంగా పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. శనివారం ఉదయం తన తల్లిదండ్రులు, సోదరుడు సుధాకర్‌తో కలసి అత్తారింటికి మనోహర్ చేరుకున్నాడు. కాపురానికి రావాలని ఉషను భర్తతో పాటు అత్తమామలు, మరిది అభ్యర్థించారు. ఆమె నిరాకరించడంతో మనోహర్ గొడవపడ్డాడు. సహనం కోల్పోయి ఇరువర్గాల వారు పరస్పరం దాడి చేసుకున్నారు. ఘటనలో లక్ష్మీనరసమ్మ, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. ఉష, మనోహర్, సుధాకర్‌కు రక్తగాయాలయ్యాయి. స్థానికులు అడ్డుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న అక్బర్ (50) శనివారం ఉదయం జాతీయ రహదారిని దాటుతుండగా... కోడూరు వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీల ఆధారంగా ప్రమాదం జరిగిన తీరును పసిగట్టారు. నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తామని కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి

మడకశిర రూరల్: ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం గొల్లహట్టి గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప(45) శనివారం ఉదయం చేపలు పట్టేందుకు కర్ణాటకలోని బిదురకెర చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి నీట మునిగి, ఊపిరి అందక మృతి చెందాడు. ఘటనపై మధుగిరి తాలూకా మిడిగేశి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి సత్యసాయి ఆరాధనోత్సవాలు



సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆరాధనోత్సవాలు ప్రశాంతి నిలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని విశేష ఫల, పుష్పాలతో అలంకరించారు. దేశవిదేశాలకు చెందిన వేలాది భక్తులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేద పఠనంతో ఆరాధనోత్సవాలను ప్రారంభించనున్నారు. 5.30 గంటలకు 'సాయి ఆరాధన' పేరుతో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 24న ఉదయం 8 గంటలకు వేద పఠనంతో కార్యక్రమాలు ప్రారంభవుతాయి. 8.20 గంటలకు సత్యసాయి విద్యార్థుల పంచరత్న కీర్తనలు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రసంగం ఉంటుంది. అనంతరం ఉదయం 10 గంటలకు హిల్‌వ్యూ స్టేడియంలో మహానారయణ సేవ ఉంటుంది. సత్యసాయి అన్న ప్రసాదంతో పాటు నూతన వస్త్రాల పంపిణీ ఉంటుంది. సాయంత్రం కలైమమణి గాయత్రి గిరీష్ సంగీత కచేరితో వేడుకలు ముగుస్తాయి. ఈ క్రమంలో ఏర్పాట్లను ఎస్పీ మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు, పట్టణ పురవీధుల్లో ఎక్కడేగాని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఎస్పీ యశ్వంత్ ఉన్నారు. కాగా, అనంతపురంలోని సత్యసాయి మహిళా క్యాంపస్ కళాశాలకు చెందిన యూజీ, పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శనివారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరి నిర్వహించారు.

వారి వికృత చేష్టలు భరించలేకున్నాం

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌కు విద్యార్థినుల ఫిర్యాదు



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

తనకల్లు: ఇద్దరు వంట మనుషులు, స్వీపర్ చేష్టలను భరించలేకపోతున్నామంటూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ ఎదుట గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. తనకల్లు మండలం సీజీ ప్రాజెక్ట్ వద్ద ఉన్న గిరిజన బాలిక గురుకుల పాఠశాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం తమకు ఏనాడూ భోజనం పెట్టడడం లేదని, వారానికోసారి పాలు, గుడ్లు ఇస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఉడికీఉడకని అన్నం, నీళ్ల చారు పెడుతున్నారన్నారు. వంట మనుషులు మాలతీబాయి, శకుంతలబాయి, స్వీపర్ రమణమ్మ ఇష్టానుసారంగా మాట్లాడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. చేతికి దొరికిన వస్తువులతో కొడుతున్నారన్నారు. ఏఎన్‌ఎం కూడా తమని పట్టించుకోడం లేదన్నారు. దీంతో అధికారుల తీరుపై వడిత్యా శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను వేధిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌టీడబ్ల్యూ మోహన్‌రామ్, తహసీల్దార్ మధునాయక్, ఎస్‌ఐ రాంభూపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరనాయుడు, జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జునాయక్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్, బంజారా సంఘం నాయకులు కృష్ణానాయక్, చలపతినాయక్, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ లైన్.. ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోతున్న చింత చెట్టు

చిలమత్తూరు: విద్యుత్ లైన్ తెగిపడడంతో ఓ రైతుకు సంబంధించి రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం వీరాపురం పంచాయతీ భూపసముద్రం గ్రామానికి చెందిన రైతు నంజిరెడ్డి పొలం మీదుగా వెళుతున్న విద్యుత్ లైన్ తీగలు శనివారం ఉదయం తెగిపడ్డాయి. దీంతో తీగలు ఒకదానితో ఒకటి ముడిపడడంతో మంటలు చెలరేగి డ్రిప్ పైపు కట్టలు, కట్టెలు, మల్చింగ్ కవర్, 15 కొబ్బరిచెట్లు, ఓ చింత చెట్టు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. విషయాన్ని గమనించిన రైతులు వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేందుకు శ్రమించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి



అంబిక మృతదేహం

కదిరి అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... కదిరి మండలం కాలేపల్లి క్వాటర్స్‌కు చెందిన గంగాధర్, మంజుల దంపతుల కుమార్తె అంబిక (9) ఆరో తరగతి చదువుతోంది. శనివారం ఉదయం అదే కాలనీలో నివాసముంటున్న తన మేనమామ మణికంఠకు వెళ్లిన బాలిక... అక్కడి రేకుల షెడ్డుకు ఏర్పాటు చేసిన స్తంభాన్ని తాకింది. అప్పటికే రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురైన అంబిక ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందింది.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం



పోటీలకు హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

రొళ్ల: రాష్ట్ర స్థాయి షూటింగ్ క్రీడా పోటీలు శనివారం రొళ్లలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు జరిగిన పోటీల్లో కర్నూలు జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు 21–9 పాయింట్ల తేడాతో గెలుపొందింది. అలాగే తూర్పు గోదావరిపై నంద్యాల, విశాఖపై కృష్ణ జిల్లా, శ్రీసత్యసాయి జిల్లాపై ఎన్టీఆర్ జిల్లా, నంద్యాలపై వైఎస్సార్ జిల్లా జట్టు గెలుపొందాయి. బాలికల విభాగంలో శ్రీసత్యసాయి జిల్లాపై చిత్తూరు జిల్లా జట్టు, నంద్యాలపై చిత్తూరు జట్టు గెలుపొందింది. బాలిక విభాగంలో కృష్ణా, చిత్తూరు, తూర్పుగోదావరి, కర్నూలు జట్లు, బాలుర విభాగంలో కృష్ణా, చిత్తూరు, విశాఖపట్నం, అనంతపురం, ఎన్టీఆర్, నంద్యాల, తూర్పుగోదావరి జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి.

వ్యక్తి హత్య



మధు (ఫైల్)

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామ సమీపంలో పావగడ తాలూకా కడమలకుంట గ్రామానికి చెందిన మధు (30) హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం ఎగువ రామగిరి గ్రామానికి వారం రోజుల క్రితం వెళ్లాడు. శనివారం ఉదయం హతుడై కనిపించాడు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అనుమానితుల్లో ఓ మహిళ ఉన్నట్లు సమాచారం. కాగా, వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా వదంతులు వ్యాపించాయి.